సాక్షి
ప్రకాశం
శనివారం । 17 । మే । 2025



పశువుల బీడు.. ఫలహారం

మద్దిపూడి మండలంలో టీడీపీ నేతలు పశువుల బీడు భూములను స్వాహా చేశారు. దళితుల భూములను సైతం కాజేశారు. యథేచ్ఛగా భూ దందాలకు పాల్పడి రికార్డులు మార్చేశారు. - IIలో..



అవ్వను కొట్టింది ఆ వీధోల్లే..

మార్కాపురంలో ఈ నెల 14వ తేదీ వృద్ధురాలిపై దాడి, దోపిడీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.6.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
40 /26

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జెడ్పీలో కారుణ్య నియామకాలు

- పత్రాలు అందజేసిన చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కారుణ్య నియామకాల పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజా పరిషత్‌లో పని చేస్తూ మరణించిన సిబ్బంది కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలిచ్చారు. సంబంధిత నియామక పత్రాలను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శుక్రవారం స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. మొత్తం ఆరుగురికి ఆఫీసు సబార్డినేట్లుగా నియామకపు ఉత్తర్వులు అందజేశారు. పత్రా లక్ష్మి (ఒంగోలు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం), పీవై మారుతి సాయిరాం ప్రకాష్ (వీవీ పాలెం మండల ప్రజా పరిషత్), గోసాని అనంతలక్ష్మి (మార్కాపురం మండల ప్రజా పరిషత్), తమ్మినేని ప్రదీప్ కుమార్ (వెలిగండ్ల మండల ప్రజా పరిషత్), మేకల అనూష (సంజీవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల), కొమ్మనూరి సునీతారాణి (మార్కాపురం బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాల)కి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించడం ద్వారా జెడ్పీకి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.చిరంజీవి, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.బాలమ్మ, ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ ఆఫీసర్ చల్లా శ్రీనివాసకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీల అభ్యున్నతికి చర్యలు

- మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ అన్నారు. ఒంగోలులోని భాగ్యనగర్‌లో గల డీఆర్‌డీఏ టీటీడీ సెంటర్‌లో జిల్లాలోని దళిత సంఘాల నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 2025–26 ఏడాదికి సంబంధించి ఎస్సీ కార్యాచరణలో కొన్ని మార్పులు చేయనున్నట్లు చెప్పారు. పేదల అభ్యున్నతికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నాగులుప్పలపాడు: ఈ నెల 6వ తేదీ జాతీయ రహదారిపై పొగాకు తగలబెడుతున్న రైతులు

గిట్టని ధర.. రైతు కన్నీర!

వేలం బహిష్కరణలు.. రోడ్డుపై పొగాకు రైతుల ధర్నాలు

మద్దతు కోసం ఒకప్పుడు ఉద్యమబాట పట్టారు జిల్లా పొగాకు రైతులు.. తుపాకీ గుళ్లకు తమ గుండెలను ఎదురొడ్డారు.. పలువురు రైతులు ఆ తుపాకీ గుళ్లకు బలయ్యారు.. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి.. గత ఐదేళ్లలో లాభాలు చవిచూసిన వారు నేడు గిట్టుబాటు ధర లభించక రగిలిపోతున్నారు. వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమై 65 రోజులు గడుస్తున్నా మద్దతు ధర కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఒకవైపు వ్యాపారుల మాయాజాలం.. మరోవైపు పొగాకుబోర్డు, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆందోళన బాట పట్టారు. రోజుకో ప్రాంతంలో ధర్నాలు చేస్తున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్క కనిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని పరిశీలిస్తే.. గురువారం 353 బేళ్లు రాగా, అందులో గరిష్ట ధర పలికినవి కేవలం 25 మాత్రమే. అంటే దోపిడీ ఏ స్థాయిలో జరుగుతోందో అవగతమవుతోంది.

- వేలం కేంద్రాల్లో నిలువు దోపిడీ
- కొనుగోలు ప్రారంభమై 65 రోజులు
- నాణ్యమైన పొగాకుకూ దిగజారిన ధరలు
- వేలం కేంద్రాలకు రాని ప్రధాన కంపెనీలు
- రైతుల గోడు పట్టని చంద్రబాబు ప్రభుత్వం
- పెట్టుబడి కూడా రాదేమోనని రైతుల ఆందోళన
- నాగులుప్పలపాడు, కొండపి, కనిగిరి వేలం కేంద్రాల్లో రైతుల నిరసనలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రకాశం రీజియన్ పరిధిలో గతేడాది కిలో పొగాకు ధర గరిష్టంగా రూ.380 పలకడంతో రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది భూముల కౌలు, బ్యారన్ల అద్దెలకు రెక్కలొచ్చాయి. కూలి ధరలు సైతం భారీగా పెరిగాయి. అయినప్పటికీ నిబంధనలు పక్కన పెట్టి మరీ రైతులు అధిక విస్తీర్ణంలో పొగాకు సాగు చేశారు.



క్యూరింగ్ జరిగిన పొగాకు

ప్రస్తుత పంట కాలంలో పొగాకు కొనుగోళ్లు మార్చి 10వ తేదీ ప్రారంభించారు. ప్రారంభ ధర కిలోకు గరిష్టంగా రూ.290 పలికింది. తొలి రోజు 4 వేలం కేంద్రాల్లో, మిగిలిన 7 వేలం కేంద్రాల్లో దశల వారీగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కొనుగోళ్లు ప్రారంభమై 65 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ రైతులు మద్దతు ధర కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

వేలం కేంద్రాల్లో నిలువు దోపిడీ...

రోజులు గడుస్తున్నా ధరలో పెరుగుదల, కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి నిలువు దోపిడీ చేస్తున్నారు. నాణ్యమైన పొగాకుకు కూడా కిలోకు కనిష్టంగా రూ.200, గరిష్టంగా రూ.280 లభిస్తోంది. ధరలు పెరగకపోవడంతో రైతులు వేలం కేంద్రాలకు బేళ్లు తక్కువగా తెస్తున్నారు. వాటిని సైతం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడంతో రైతులు తిరిగి కోల్డ్‌స్టోరేజీలకు తీసుకెళ్లిపోతున్నారు. ఫలితంగా రైతుపై రవాణా చార్జీలు అదనపు భారంగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ఉన్న దాదాపు అన్ని కోల్డ్ స్టోరేజీలు పొగాకు బేళ్లతో నిండిపోయాయని తెలుస్తోంది. రీజియన్ పరిధిలో మొత్తం 32 కంపెనీలు పొగాకు కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. కానీ, కేవలం 15 నుంచి 18 కంపెనీలు మాత్రమే వేలంలో పాల్గొంటున్నాయి. దాంతో అనుకున్న మేర ధర పలకడం లేదు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్నా సరైన ధర రాక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం కౌలు డబ్బులు, పెట్టుబడి వస్తే చాలని దీనంగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు పొగాకు ప్రధాన ఎగుమతి సంస్థలైన ఐటీసీ, జీపీఐ, పీఎస్ఎస్, డక్కన్, అలయన్స్ వంటి కంపెనీలకు ఇంత వరకూ ఎగుమతి ఆర్డర్లు ఖరారు కాలేదని వాళ్లే స్వయంగా చెబుతున్నారు. అలాంటప్పుడు ఎందుకు వేలంలో పాల్గొంటామని ముందుగా కంపెనీల పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారంటూ రైతులు నిలదీస్తున్నారు. గిట్టుబాటు ధర లేక వేలానికి బేళ్లు తీసుకురావడం లేదు. లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదు. ఇప్పటికైనా ట్రేడర్లతో అధికారులు చర్చించి, గిట్టుబాటు ధర ఇప్పించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



పొగాకు పంట

సాగు ఇలా...

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కలిపి 11 వేలం కేంద్రాలు ఉన్నాయి. అందులో నల్లరేగడి నేలల్లో పండే పొగాకుకు ఐదు వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటిలో వెల్లంపల్లి, ఒంగోలు 1, 2, కొండపి, టంగుటూరు కలిపి ఐదు వేలం కేంద్రాల పరిధిలో 13,200 బ్యారన్లు ఉన్నాయి. తేలికపాటి నేలల్లో పండించే పొగాకుకు సంబంధించి ఆరు వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటిలో పొదిలి, కనిగిరి, కందుకూరు 1, 2, నెల్లూరు జిల్లాలోని కలిగిరి, డీసీపల్లి వేలం కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 24,976 బ్యారన్లు ఉన్నాయి. సుమారు 30 వేల మంది రైతులు పొగాకు సాగుచేస్తున్నారు. పొగాకు బోర్డు ఈ ఏడాది 68,500 హెక్టార్లలో సాగుకు అనుమతివ్వగా పరిమితికి మించి 88 వేల హెక్టార్లలో సాగు చేశారు. బోర్డు అనుమతిచ్చిన పంట ఉత్పత్తి పరిమాణం సుమారు 105.27 మిలియన్ కిలోలు ఉండగా, పంట ఉత్పత్తి అంచనా సుమారు 162 మిలియన్ కిలోలుగా నిర్ణయించారు.

ఆందోళనలు ఇలా...

మే 6వ తేదీ : గిట్టుబాటు ధర లభించడం లేదంటూ పొగాకు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగులుప్పలపాడు కూడలిలోని 216వ నంబర్ జాతీయ రహదారిపై పొగాకు బేళ్లకు నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రోడ్డుపై పొగాకు బేళ్లు తగలబెట్టారన్న సాకుతో రైతులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

మే 8వ తేదీ : మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు ధర దక్కనివ్వడం లేదని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. టుబాకో బోర్డు అధికారులతో కలిసి త్రోవగుంట వద్ద వేలం కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

మే 15వ తేదీ : కొండపి, కనిగిరి వేలం కేంద్రాల పరిధిలో రైతులు మద్దతు ధర కోసం ఆందోళన చేపట్టారు. కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో గురువారం నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. వేలం ప్రారంభం నుంచి పొగాకు ధరలను తగ్గిస్తూ బయ్యర్లు కొనుగోలు చేశారు. మంచి గ్రేడ్ పొగాకును కూడా తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు వేలాన్ని బహిష్కరించారు.

అలాగే కనిగిరి పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైన కాసేపటికే వేలం నిలిచిపోయింది. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేలాన్ని బహిష్కరించారు. నాణ్యమైన రకానికి సైతం రూ.240కి మించి ఇవ్వకపోవడంతో మూకుమ్మడిగా వేలాన్ని నిలిపివేశారు.

పెరిగిన ఖర్చులు, తగ్గిన దిగుబడి...

ప్రతి సంవత్సరం ఒక ఎకరాకు సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ సంవత్సరం తెగుళ్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా కేవలం ఆరు నుంచి 7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అంతేగాకుండా ఎకరాకు సుమారు రూ.2.50 లక్షల వరకు ఖర్చయిందని రైతులు చెబుతున్నారు. పెరిగిన ఖర్చులకు తగ్గట్లుగా ఈసారి ధరలు లేవని, ప్రస్తుతం ఉన్న ధరలను పరిశీలిస్తే భయమేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు నేలచూపులు చూస్తుండటంతో పొలం ఉన్న రైతుకు ఎకరాకు రూ.50 వేలు, కౌలు రైతుకు రూ.90 వేలు నష్టం వచ్చే పరిస్థితులు ఉన్నాయని రైతాంగం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

మార్క్‌ఫెడ్ ద్వారా ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం...



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతులు ధరలు లేక సంక్షోభంలో ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్‌ను రంగంలో దించి కొనుగోలు చేయించారు. దాంతో వ్యాపారులు పోటీపడి మరీ పొగాకు కొనుగోలు చేశారు. అందువల్ల పొగాకు రైతుకు కిలోకు రూ.380 వరకు ధర పలికింది. ప్రస్తుతం పొగాకు ధరల్లో సంక్షోభం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి పొగాకును గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయించాలి. లేకుంటే పొగాకు రైతులు నష్టపోయి ఆత్మహత్యలే శరణ్యమవుతుంది.

– తూమాటి మాధవరావు, శాసనమండలి సభ్యుడు

వ్యాపారులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు



రైతు నాయకుల్లోనే కొందరు వ్యాపారులు, బోర్డు అధికారులకు తొత్తులుగా మారారు. అందుకోసం 10 శాతం రైతు నాయకుల పొగాకుకు మంచి ధర ఇస్తున్నారు. మిగతా 90 శాతం రైతులు నష్టపోతున్నారు. 2000 సంవత్సరంలో పొగాకుకు క్రాప్ హాలిడే ప్రకటించాం. 2005 తర్వాత నుంచి పొగాకు ధరలు హీనస్థితికి చేరుకున్నాయి. రైతు నాయకులను ప్రలోభపెట్టే స్థాయికి కార్పొరేట్ సంస్థలు దిగజారాయి. రైతులు దీనిని గమనించాలి.

– చుండూరు రంగారావు, జిల్లా అధ్యక్షుడు, సంయుక్త కిసాన్ మోర్చా

ఎకరాకు రూ.50 వేలు నష్టం



నేను 40 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. మూడు బ్యారన్లు నా సొంతవి. రెండు బ్యారన్లు కౌలుకు తీసుకుని సాగు చేశా. ఈసారి సాగు ఖర్చులు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తే భయమేస్తోంది. ఎకరాకు సుమారు 50 వేల వరకు నష్టపోతాను. కౌలుకు తీసుకున్న బ్యారన్లకు అదనంగా కౌలుతో కలిపి 70 వేల వరకు నష్టపోయే అవకాశం ఉంది. గత సంవత్సరం కేజీ రూ.380 పలకగా, దానికన్నా మేలిమైన పొగాకుకు ఈ సంవత్సరం కేజీ రూ.220, రూ.230 మాత్రమే ఇస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– పర్చూరి శ్రీను, రైతు, నేతివారిపాలెం

అవినీతిపరులకే ఉపాధి!



వాగుమడుగులో ఒకే ఫొటోతో వేసిన మస్టర్లు



నాగరాజుకుంటలో...

- ఉపాధి హామీ పథకంలో రోజురోజుకూ పెరుగుతున్న అవినీతి
- కూటమి ప్రభుత్వం వచ్చాక నాయకుల జేబులు నింపుకునే పనులకే ప్రాధాన్యం
- మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లను తమవారిని నియమించుకుని ఒకే ఫొటోతో అనేకమందికి మస్టర్లు
- చేతివాటం చూపిస్తున్న నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు

కొనకనమిట్ల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో రోజురోజుకూ అవినీతి పెరిగిపోతోంది. నీకంటే నేనేమీ తక్కువ కాదంటూ పలు గ్రామాల్లో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఉపాధి హామీ పథకం నిధులు బొక్కేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ నాయకుల జేబులు నింపేందుకే అన్నట్లుగా ఉపాధి పనులు జరుగుతున్నాయి. నీటి తొట్ల నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించడంతో పాటు గ్రామాల్లో కూటమి పార్టీల నాయకులకు ఇష్టమైన వారినే ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లుగా నియమించుకున్నారు. వారంతా కూటమి నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ అధికారుల సహకారంతో ఉపాధి హామీ పథకం పనుల్లో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఇప్పటి వరకు చేసిన ఉపాధి పనులు ఏ ఒక్కరికీ ఉపయోగపడకపోగా, కూటమి నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు మాత్రం బాగా ఉపయోగపడ్డాయని కూటమి నాయకుల్లోని మరోవర్గం విమర్శిస్తుండటం విశేషం.

పనులు నిల్.. మస్టర్ ఫుల్...

కొనకనమిట్ల మండలంలో గతంలో వాటర్ షెడ్ ద్వారా చేసిన పనులను ఉపాధి హామీ పథకం పనుల్లో చేసినట్లు మస్టర్లు వేసుకున్నారు. ప్రస్తుతం వాగుమడుగు, నాగరాజుకుంట, పెదారికట్ల గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పుమంటున్నాయి. ఒకే ఫొటోతో వారికి కావాల్సిన వారికి మస్టర్లు వేసుకుంటూ ఆన్‌లైన్ వ్యవస్థను కూడా తప్పుదారి పట్టించేలా ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. పెదారికట్లలో ఏకంగా మోటార్ సైకిల్‌పై ఉన్న వ్యక్తి ఫొటోను మస్టర్‌లో చూపించారు. పలు గ్రామాల్లో స్థానికంగా లేకున్నా మస్టర్లు వేస్తున్నారు. ఎక్కడో ఉంటున్న వారు కూడా ఇక్కడ పనికి వచ్చినట్లుగా జాబ్‌కార్డు నంబర్లు పెట్టి వారి స్థానంలో మరొకరి ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఒకే ఫొటో అప్‌లోడ్ చేసి పలువురికి మస్టర్ వేస్తున్నారు. నగదు వచ్చిన సమయంలో వారానికి రూ.100 నుంచి రూ.200 వరకు ఒక్కొక్కరి వద్ద వసూలు చేసి మేట్లు కొంత తీసుకుని ఫీల్డ్ అసిస్టెంట్లకు పంచుతున్నారు. ఇటీవల నాగిరెడ్డిపల్లిలో ఓ వర్గం వారు వారం పనికి వెళ్తే రెండు రోజులకు నగదు ఇవ్వడంపై కూలీలు నిరసన వ్యక్తం చేశారు. అసలు పలు గ్రామాల్లో కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నవారికే డిమాండ్ షీట్లు ఇస్తుండటంతో మిగతా వారు వేరే పనులకు వెళ్తున్నారు. గత ప్రభుత్వంలో అడిగిన వారందరికీ ఉపాధి పనులు చూపించి చేతినిండా పని దొరికేలా చేస్తే.. కూటమి ప్రభుత్వంలో పనులు నిల్.. మస్టర్ ఫుల్ అన్నట్లుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



నాగిరెడ్డిపల్లిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



పెదారికట్లలో మస్టర్లో అప్‌లోడ్ చేసిన మోటార్ సైకిల్‌పై వెళ్లే వారి ఫొటో

సొంత అవసరాలకే ప్రాధాన్యం...

కొనకనమిట్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీలకుగానూ 24 పంచాయతీలలో పనులు చేస్తున్నారు. 13,005 జాబ్ కార్డులు ఉండగా, 24,253 మందికి మస్టర్లు ఉన్నాయి. 50 మంది చొప్పున 176 గ్రూపులు ఉండగా, 8,800 కూలీలు పనులకు వెళ్తున్నారు. మొత్తం 100 రోజుల పనిదినాలకు సంబంధించి 7,74,000 మందికి రూ.38.70 కోట్ల నిధులు కేటాయించనున్నారు. అలాగే, 8 గ్రామాల్లో 35 గోకులం షెడ్ల ఏర్పాటుకు రూ.80 లక్షల వరకు మంజూరయ్యాయి. వాటిని కూడా తాత్కాలికంగా ఏర్పాటు చేసి సొంత అవసరాలకే ప్రాధాన్యమిస్తూ ఉపయోగించుకుంటున్నట్లు విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చాం

ఉపాధి హామీ పనుల్లో పలు గ్రామాల్లో జరుగుతున్న అక్రమాలు మా దృష్టికి వచ్చాయి. ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లకు నోటీసులు ఇచ్చాం. ఏదైనా అవకతవకలు జరిగితే గ్రామాల్లో విచారణ చేపట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటాం. మస్టర్ల విషయంలో పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– ఏపీఓ బుల్లెన్నరావ్

ట్రిపుల్ ఐటీని పట్టించుకోకపోవడం దారుణం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి

ఒంగోలు టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీ కాలేజీని ఒంగోలు నుంచి తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి విమర్శించారు. జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీ కాలేజీని తరలిస్తున్నా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించకపోవడం అంతకంటే దారుణమని మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే ఒంగోలుకు ట్రిపుల్ ఐటీ కాలేజీ మంజూరైందని, ఆయన మరణం తర్వాత తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని తెలిపారు. ఇడుపులపాయలోని ఆర్‌కే వ్యాలీలో ఉన్న ఇడుపులపాయ క్యాంపస్, ఒంగోలు క్యాంపస్ విద్యార్థుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అక్కడి క్యాంపస్‌ను ఒంగోలు తరలించారని వివరించారు. 2019 అక్టోబర్ 2వ తేదీ ఒంగోలులో రావ్ అండ్ నాయుడు క్యాంపస్‌లో ప్రారంభించిన ట్రిపుల్ ఐటీ కాలేజీలో ప్రస్తుతం 1300 వందల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. 2019కి ముందు పామూరు సమీపంలోని దూబగుంట వద్ద ట్రిపుల్ ఐటీ కాలేజీకి ఆర్భాటంగా శంకుస్థాపన చేసి పనులు కూడా ప్రారంభించకుండా వదిలేసిన నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదని చెప్పారు. మళ్లీ ఇప్పుడు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు జిల్లా విద్యార్థులకు అన్యాయం చేస్తూ ఇడుపులపాయకు తరలించే ప్రయత్నాలు చేస్తుండటం దుర్మార్గమని చెప్పారు. ఇప్పటికైనా జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాలని, జిల్లా నుంచి ట్రిపుల్ ఐటీ కాలేజీని తరలించకుండా ముఖ్యమంత్రి మీద ఒత్తిడి తీసుకురావాలని కోరారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాలడుగు రాజీవ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు పల్నాటి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రామాలయ గోపురంపై పిడుగు


గోపురంపై బొమ్మలు పాక్షికంగా దెబ్బతిని గ్రీన్‌మ్యాట్‌తోపాటు కర్రలు విరిగిన దృశ్యం

సింగరాయకొండ: మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ బేసిన్ పల్లెపాలెంలోని రామాలయ గోపురంపై శుక్రవారం తెల్లవారుజామున పిడుగు పడింది. భారీ వర్షం కురుస్తున్న సమయంలో పిడుగు పడటంతో స్థానికులు భయాందోళనకు గురికాగా, గోపురంపై సిమెంటు బొమ్మలు నాలుగు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ ఆలయంలో ప్రతి 5 ఏళ్లకు ఒకసారి నిర్వహించే తిరునాళ్ల జూన్ 6వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆలయానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. రంగులు వేసేందుకు ఆలయం చుట్టూ గ్రీన్ మ్యాట్ వేయగా, పిడుగుపాటుకు గ్రీన్ మ్యాట్‌తో సహా కర్రలు కూడా విరిగిపోయాయని మత్స్యకారులు తెలిపారు. పిడుగు పడే సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గృహోపకరణాలకు నష్టం తప్పిందని చెప్పారు.

నేడు పీవీపురంలో బండలాగుడు పోటీలు

బేస్తవారిపేట: మండలంలోని పీవీ పురంలో పేరంటాలమ్మ–పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి నుంచి ఏడు బహుమతులు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 6303140260, 9000762434ను సంప్రదించాలని కమిటీ సభ్యులు సూచించారు.


విద్యుదాఘాతంతో రాజస్థాన్ యువకుడు మృతి


మృతి చెందిన యువకుడు

కంభం: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి కంభంలోని నెహ్రూ నగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. నెహ్రూనగర్ మొదటి లైనులో రాజస్థాన్‌కు చెందిన కొందరు ఐస్‌క్రీమ్ తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. పది రోజుల క్రితం రాజస్థాన్ నుంచి తమ బంధువైన రాధేశ్యాం(18) కంభం వచ్చి వారి దగ్గర ఉంటున్నాడు. గురువారం రాత్రి వాష్ రూమ్‌కు వెళ్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఫిర్యాదు అందుకున్న కంభం ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. శుక్రవారం ఉదయం మృతదేహానికి కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా రాజస్థాన్ బయలుదేరి వెళ్లారు.

పశువుల బీడు.. ఫలహారం


గుండ్లసముద్రం రెవెన్యూ పరిధిలోని పశువుల బీడు


టీడీపీ నేత సాగు చేసుకుని అనుభవిస్తున్న మేతభూమి

మద్దిపూడి మండలంలో టీడీపీ నేతల భూదందా

ప్రభుత్వ భూములతో పాటు దళితుల జాగా కబ్జా

- ఎకరాకు రూ.50 వేలు ఇస్తే చాలు కబ్జాదారుల పేరుతో భూముల ఆన్‌లైన్
- ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్న అక్రమాలు
- రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారులపై మంత్రి, జాయింట్ కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు
- సర్వత్రా చర్చనీయాంశంగా మారిన భూ రికార్డులు ట్యాంపరింగ్

టీడీపీ నాయకులు భూభకాసురుల అవతారమెత్తారు. పశువుల బీడు భూములతోపాటు అమాయక దళితుల సాగుభూములను సైతం తమ పేరుపై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ నాయకులు సాగిస్తున్న భూదందాకు రెవెన్యూ అధికారులు వంతపాడుతున్న తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండపి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అడ్డూఅదుపు లేకుండా అక్రమాలకు తెగబడుతున్న తీరుపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పాలనను గాలికొదిలేసి అక్రమ మద్యం, మట్టి, గ్రావెల్, ఇసుక దందాలతోపాటు భూకబ్జాలకు పాల్పడుతున్న తెలుగు తమ్ముళ్లను చూసి 'ఔరా ఇందుకా కూటమికి ఓటేసి గెలిపించింది' అని ప్రజలు విస్తుపోతున్నారు.

మద్దిపూడి:

'ఏంటి సార్ మా పార్టీనే అధికారంలో ఉంది. మేం చెప్పింది వినాలి. మేం చేయమన్నది చేయాలి. కాదూకూడదంటే పైవాళ్ల దగ్గర తేల్చుకుంటాం' అచ్చు ఇలాగే ఉన్నాయి కొండపి నియోజకవర్గంలో కూటమి నేతల బెదిరింపులు. మద్దిపూడి మండలంలో తాము కోరిన పని చేసిపెట్టాలంటూ రెవెన్యూ అధికారులను ప్రలోభాలకు గురిచేసి, విచ్చలవిడిగా డబ్బు వెదజల్లి ప్రభుత్వ భూములతో పాటు దళితుల సాగు భూమి రికార్డులను సైతం టీడీపీ నాయకులు ట్యాంపరింగ్ చేశారు. బాధిత రైతులు శుక్రవారం జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

కాసుల కక్కుర్తి.. కూటమి నేతలతో దోస్తీ..


మండలంలోని గుండ్లసముద్రం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 571 లో 207.86 ఎకరాల విస్తీర్ణంలో పశువుల మేత పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిలో మండలంలోని గుండ్లసముద్రం, ఎస్టీ రాజుపాలెం, కొష్టాలపల్లి తదితర గ్రామాలకు చెందిన పశువులను మేపుతుంటారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి, కాసుల కక్కుర్తితో తలొగ్గిన రెవెన్యూ అధికారులు పశువుల బీడును సబ్ డివిజన్ చేసి మరీ పచ్చనేతల పేర్లు వెబ్ ల్యాండ్‌లో నమోదు చేశారు. ఈ ఏడాది జనవరిలో ఖాతా నంబర్ 918లో సర్వే నంబర్ 571–3లోని 4.0750 ఎకరాలు, అదే సర్వే నంబరులో ఖాతా నంబర్ 959లో మరొకరి పేరుతో 5 ఎకరాల విస్తీర్ణంగల పశువుల మేత పోరంబోకు భూములను ఆన్‌లైన్ చేశారు. అలాగే సర్వే నంబర్ 571–సీలో ఖాతా నంబర్ 41 మీద 5 ఎకరాలు, ఖాతా 905 మీద 5 ఎకరాలు, సర్వే నంబరు 571–8లో ఖాతా నంబర్ 999 మీద ఒక ఎకరా చొప్పున పశువుల బీడును ఆన్‌లైన్ చేశారు. ఇందుకుగాను పచ్చనేతలు ఎకరాకు సుమారు రూ.50 వేల చొప్పున తహసీల్దార్‌కు ముట్టజెప్పారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కాగా గుండ్లసముద్రంలో మేత బీడు ఆక్రమణపై బాధితులు ఈ నెల 3వ తేదీన మంత్రి డీబీవీ స్వామికి ఫిర్యాదు చేయగా విచారించాలని ఆర్డీఓను ఆదేశించారు.


వెబ్‌ల్యాండ్‌లో నమోదైన పేర్లు


రికార్డుల్లో పశువుల బీడుగా నమోదైన భూమి

దళితుల భూమి కబ్జా

మండలంలోని రావెళ్లవారిపాలెం గ్రామంలో దళితులకు ప్రభుత్వం కేటాయించిన భూమిని ఓ టీడీపీ నేత గుట్టుచప్పుడు కాకుండా తన కుటుంబ సభ్యుల పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నాడు. గ్రామంలో దళిత వర్గానికి చెందిన పులగం నరసమ్మకు చిమట గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 727–1లో 1.63 ఎకరాల భూమి ఉంది. దాదాపు 40 ఏళ్లుగా నర్సమ్మ ఆధీనంలో ఉన్న ఈ భూమి పంపకాల విషయమై కుమారుల మధ్య పొరపొచ్చాలున్నాయి. ఇదే అదనుగా భావించిన టీడీపీ నేత.. నరసమ్మ కుమారులకు తెలియకుండా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తన కుమార్తె పేరుతో ఆన్‌లైన్ చేయించాడు. ఇదే గ్రామానికి చెందిన పులగం పెదకోటయ్యకు సర్వే నంబర్ 727–19లో 1.88 ఎకరాల భూమిని పచ్చనేత తన కుమారుడి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకుని నకిలీ పట్టాదారు పాసుపుస్తకం తెచ్చుకున్నాడు. ఇదే గ్రామానికి చెందిన సాలసా చిన్నమ్మ భూమిని సైతం కబ్జా చేసి తన కుటుంబ సభ్యుల పేరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నాడు. విషయం తెలుసుకున్న బాధితులు రెవెన్యూ కార్యాలయం ఎదుట ఇటీవల ఆందోళనకు దిగారు.


మేత భూమిని ఆన్‌లైన్ చేయించుకున్న దృశ్యం

భూ దందాపై స్థానిక తహసీల్దార్ జ్వాలా నరసింహారావును వివరణ కోరగా.. ‹‹గుండ్లసముద్రం గ్రామంలో పశువుల మేత పోరంబోకు భూములు అన్యాక్రాంతం అయిన విషయంపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామికి ఆ గ్రామస్తులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం›› అని చెప్పారు.

భూమేతపై జేసీకి ఫిర్యాదు

గుండ్లసముద్రంలో పశువుల మేత బీడు ఆక్రమణపై పలువురు గ్రామస్తులు శుక్రవారం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. మండలంలోని రామాయపాలెం గ్రామంలో రెండో విడత భూ సర్వేను పర్యవేక్షించేందుకు వచ్చిన జేసీకి వినతిపత్రం అందజేశారు. ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన తాము రెండు ఎకరాల చొప్పున కేటాయించాలని గతంలో దరఖాస్తు చేసుకుంటే ‹‹అది మేత పోరంబోకు భూమి, ఎలా ఇస్తారు›› అని తహసీల్దార్ ప్రశ్నించారని, మరి అదే పశువుల బీడును ఇతరుల పేరుపై ఎలా నమోదు చేశారో అంతుపట్టడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. పశువుల బీడులో కొంత భూమిని 30 ఏళ్లుగా సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని గ్రామానికి చెందిన ఎం.వెంకట్రావు జేసీకి విన్నవించారు. అయితే తమ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పాదిలి శ్రీను తహసీల్దార్‌కు మీడియేటర్‌గా వ్యవహరిస్తూ తాము సాగుచేసుకుంటున్న 4.75 ఎకరాల భూమిని తన పేరుపై ఆన్‌లైన్ చేయించుకున్నారని జేసీకి ఫిర్యాదు చేశారు. అక్రమార్కుల నుంచి పశువుల బీడును కాపాడాలని విన్నవించారు. జేసీని కలిసిన వారిలో గుండ్లసముద్రం పంచాయతీకి చెందిన శ్రీరాం రమణయ్య, యర్రయ్య, నాసరయ్య, శ్రీరాం వెంకటేశ్వర్లు, గాలేటి ఆదినారాయణ, శ్రీరాం రవి, జగన్నాదం అచ్చయ్య, పొన్నర్సు వెంకయ్య, వెంకట్రావులు ఉన్నారు.


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న గుండ్లసముద్రం గ్రామస్తులు

అవ్వను కొట్టింది ఆ వీధోళ్లే..

- వృద్ధురాలిపై దాడి, దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు
- ఎస్పీ దామోదర్ పర్యవేక్షణలో పోలీసుల దర్యాప్తు
- రూ.6.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగరాజు, పక్కన సీఐ సుబ్బారావు, ఎస్సైలు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న వెంకటేశ్వరనగర్‌లో వృద్ధురాలిపై దాడికి పాల్పడి సొమ్ము దోచుకెళ్లిన విషయం తెలిసిందే. ఎస్పీ దామోదర్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఆ వీధిలోనే ఉండే ముగ్గురిని నిందితులుగా గుర్తించి కటకటాల్లోకి నెట్టారు. శుక్రవారం డీఎస్పీ యు.నాగరాజు తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న 82 ఏళ్ల వృద్ధురాలు బండి రమణమ్మ ఇంట్లోకి ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఆమె నోరు మూసిపెట్టి, ఛాతీ, ముఖంపై కొట్టి, మెడలో ఉన్న బంగారు చైను, 4 బంగారు గాజులు అపహరించారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. కాసేపటి తరువాత ఆమె తేరుకుని చూడగా మంచం చుట్టూ కారంపొడి చల్లి ఉంది. పక్కింటివారి సాయంతో తన కొడుకును పిలిపించుకుని ఒక ప్రైవేట్ వైద్యశాలలో చేరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్సై సైదుబాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎస్పీ నేతృత్వంలో దర్యాప్తు

ఎనిమిది పదుల వయసు దాటిన వృద్ధురాలిపై దాడి చేసి, దోపిడీకి పాల్పడిన తీరుపై ఎస్పీ దామోదర్ దృష్టి సారించారు. డీఎస్పీ నాగరాజు, సీఐ సుబ్బారావుతో పాటు ముగ్గురు ఎస్సైలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణ శివారులో జాతీయ రహదారి నుంచి డ్రైవర్స్ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డు వద్ద అనుమానాస్పదంగా ఉన్న కురుకుందుల మల్లికార్జున, కురుకుందుల అలియాస్ కర్పూరపు వసుంధర, దండెబోయిన కాశీనాథ్ అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలోనే దోపిడీకి పాల్పడినట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.6.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దొంగతనం ఇలా..

ఆర్థిక ఇబ్బందుల్లో కురుకుంద మల్లికార్జున, వసుంధర చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ‹‹ఒంటరి ముసలామె ఏం చేస్తుందిలే›› అని భావించి, పక్కాగా రెక్కీ నిర్వహించారు. గాఢ నిద్రలో ఉన్న ఆ వృద్ధురాలిపై పిడిగుద్దులు కురిపించి, ఒంటిపై ఉన్న బంగారు నగలు గుంజుకెళ్లారు. పోలీసులకు దొరకకూడదన్న ఉద్దేశంతో ఆమె మంచం చుట్టూ కారం చల్లారు. కాగా, 48 గంటల్లోనే కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. పోలీస్ సిబ్బందికి డీఎస్పీ రివార్డులు అందజేశారు.

ఆర్టీసీ డిపోల్లో అధిక ధరలపై కఠిన చర్యలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్

ఒంగోలు టౌన్: ఆర్టీసీ డిపోల్లోని దుకాణాల్లో అధిక ధరలకు విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం ఒంగోలు ఆర్టీసీ డిపోను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. డిపోలో గడువు తేదీ ముగిసిన కూల్‌డ్రింక్‌లు విక్రయిస్తున్నారని, వాటర్ బాటిల్, తదితరాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో డిపోలోని దుకాణాల్లో విక్రయిస్తున్న వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్‌ల ధరలను పరిశీలించారు. విచారణ కేంద్రం, పార్శిల్ కౌంటర్లను పరిశీలించారు. కౌంటర్ వద్ద ఉన్న టైం టేబుల్ చూసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సీట్లు, ఫ్యాన్లతో పాటు టాయిలెట్లలో నిరంతరం నీరుండేలా చూడాలన్నారు. ప్రయాణికులకు ఏదైనా ఇబ్బంది కలిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా ఒక ఫోన్ నంబర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ ఫోన్ నంబర్ అందరికీ అందుబాటులో ఉండేలా చేయాలన్నారు. డిపో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మంచి వాతావరణం ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బస్టాండు ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని చెప్పారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లీ జాతరా.. ఊరువాడా మోతరా..

- ఉత్సాహంగా గంగమ్మ తల్లి గ్రామోత్సవం
- 9 విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు



పీసీపల్లి: పాలేటి గంగ తిరునాళ్ల శుక్రవారం రంగరంగ వైభవంగా సాగింది. పీసీపల్లి మండలంలోని వెంగళాపురం సమీపంలో పాలేటి నది ఒడ్డున కొలువై ఉన్న గంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని శరణు వేడుతూ పాడి పంటలు సుభిక్షంగా ఉండాలని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తమ కులదైవమైన గంగమ్మ తల్లిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి యాదవులు కుటుంబాలతో సహా కదిలొచ్చారు. అమ్మవారి గ్రామోత్సవం సందర్భంగా బొల్లావులను ఆడిస్తూ.. వీరతాళ్లతో చిందులు తొక్కుతూ యువకులు సందడి చేశారు. తిరునాళ్ల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉత్సవం సందర్భంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, 23 మంది ఎస్సైలు, 200 మంది కానిస్టేబుళ్లు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

హత్య కేసులో ఏడుగురికి యావజ్జీవం

- నిందితులు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా
- ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పూర్ణిమ తీర్పు

చీరాల రూరల్: ఓ వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో ఏడుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన మోసా సూరిబాబు(30) వద్ద రెండేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన పిక్కి సింహాద్రి రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న డబ్బు తిరిగి చెల్లించాలని సూరిబాబు కోరగా సింహాద్రి ఇవ్వలేదు. అంతేగాక తన భార్యతో సూరిబాబుకు అక్రమ సంబంధం ఉందని గ్రామంలో కొంతమంది చర్చించుకుంటున్న విషయం సింహాద్రి దృష్టికి వచ్చింది. సింహాద్రి తన భార్యతోపాటు సూరిబాబుపై అనుమానం పెంచుకున్నాడు. అనుమానం పెనుభూతంగా మారడంతో సూరిబాబును చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ విషయంలో సహకరించాలని సింహాద్రి తన కొడుకు, కూతురుతోపాటు గ్రామానికి చెందిన మరో ఆరుగురు పిక్కి శాంతి, బొంది డేవిడ్, పిక్కి రాజు, పిక్కి ఆనంద్, పిక్కి సత్తెమ్మ, ఓరుపుల మాణిక్యరావును కోరాడు. వారు అంగీకరించడంతో సూరిబాబు హత్యకు వ్యూహ రచన చేశాడు.

కూతురు వివాహం పేరుతో..

సింహాద్రి తన కుమార్తెను సూరిబాబుకు ఇచ్చి వివాహం చేస్తానని సూరిబాబును నమ్మించాడు. తన ఇంటికి భోజనానికి రావాలని హత్యకు ఐదు రోజుల ముందు నుంచి ఆహ్వానిస్తున్నాడు. 2023 అక్టోబర్ 10వ తేదీన సూరిబాబుకు సింహాద్రి మరోమారు ఫోన్ చేయగా అంగీకరించాడు. ఈ విషయాన్ని తన బంధువులకు ముందుగానే చేరవేసి కర్రలు, ఇనుపరాడ్లు, పైపులు అందించి తన ఇంట్లో దాచాడు. ఇవేవీ తెలియని సూరిబాబు రాత్రి 8 గంటల సమయంలో సింహాద్రి ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన సింహాద్రి, ఇంట్లో దాగి ఉన్నవారు ఇష్టమొచ్చినట్లుగా దాడి చేశారు. సూరిబాబు ఇంటివద్ద లేకపోవడంతో అనుమానించిన అతని అక్క ఎల్లియమ్మ బంధువులను తీసుకుని సింహాద్రి ఇంటికి వెళ్లింది. అయితే సూరిబాబు ఇక్కడకు రాలేదని సింహాద్రి కూతురు మరికొందరు కలిసి అడ్డగించి వాదనకు దిగారు. ఇంటి లోపల ఏదో జరుగుతోందని అనుమానం వచ్చిన ఎల్లియమ్మ ఆమె బంధువులు బలవంతంగా లోనికి ప్రవేశించారు. తీవ్రగాయాలతో రక్తపు మడుగులో పడి ఉన్న సూరిబాబును హుటాహుటిన ఓ ఆటోలో చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సూరిబాబు సోదరి ఫిర్యాదు మేరకు ఈపురుపాలెం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీవిత ఖైదు.. జరిమానా..

బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఎ.మల్లికార్జునరావు నిందితులపై హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఒంగోలు మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎ.పూర్ణిమ కేసును పూర్తిస్థాయిలో విచారించారు. నిందితులపై ఉన్న నేరారోపణలకు తగిన సాక్ష్యాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డి పోలీసుల సాయంతో కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో న్యాయమూర్తి ఏడుగురు నిందితులకు హత్యానేరం కింద జీవిత ఖైదు విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి సీఐ ఎ.మల్లికార్జునరావు, ప్రస్తుత సీఐ పి.శేషగిరిరావు, కోర్టు కానిస్టేబుల్ షేక్ కరిముల్లా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేవీ రామేశ్వరరెడ్డిని ఎస్పీ అభినందించారు.

నేడు బీట్ ద హీట్

ఒంగోలు సబర్బన్: బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నేడు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. ఆ మేరకు జిల్లాలో వేసవి తాపాన్ని తగ్గించే కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్లు, తదితర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 17వ తేదీ మూడో శనివారం చేపట్టే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ అంధ్ర కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. హౌసింగ్ పురోగతి, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం అమలు, ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ప్రతి నెలా మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వేసవిని దృష్టిలో పెట్టుకుని భవనాలపై రూఫ్ టాప్ గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రముఖ రద్దీ కూడళ్లలో నీడ సౌకర్యం కోసం షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని, బిల్డింగ్‌లపై చల్లదనానికి కూల్ వైట్ పెయింటింగ్ చేసుకోవాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడం వంటి ఉష్ణోగ్రతను తగ్గించే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే కార్మికులకు వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడం, ప్రథమ చికిత్స కేంద్రాలు, వడదెబ్బ బారినపడే వారి కోసం హెల్త్‌క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పక్షులు, పశువుల కోసం నీటితొట్లు, నీటి పాత్రల్లో నీళ్లు నింపి అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం కూడా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం ఈ కార్యక్రమ నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి సారించాలి...

క్షేత్ర స్థాయిలో పారిశుధ్య కార్యక్రమాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని పంచాయతీరాజ్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ సమీక్షిస్తూ జిల్లాలో పేదలకు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, మే 31వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా 8,839 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. కానీ, ఇంతవరకు 3,521 ఇళ్ల నిర్మాణాలే పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరు నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జన్ మన్ కార్యక్రమం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు కూడా త్వరగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. అందుకు అనుగుణంగా పనిచేసి త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.